

కాశీపట్నంకు 16 కిలో మీటర్ల దూరంలో కొండపై నిర్మిస్తున్న అనంత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రకృతి అందాలు మరింత శోభను ఇస్తున్నాయి. ఈ ఆలయానికి ఏర్పాటుచేస్తున్న రింగ్ రోడ్డుతో అదనపు అందం నెలకొంది.

– అనంతగిరి (అరకులోయ రూరల్)

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 24న 10 మి.మీ, 25న 12, 26న 6, 27న 2, 28న 3 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 31.4 నుంచి 34.8 డిగ్రీలు, గాలి గంటకు 5 నుంచి 8 కి.మీ. వేగంతో వీస్తుందని ఆమె చెప్పారు.



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటన దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల భద్రతపై ప్రశ్నలను లేవనెత్తింది. భద్రత సరే.. సదుపాయాలైనా ఉన్నాయా.. అనే అనుమానాలూ రేకెత్తించింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్య, నర్సింగ్ సిబ్బందికి అవసరమైన భద్రత, సౌకర్యాల కొరతపై పలువురు వైద్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. నక్కపల్లి/మునగపాక

పోలీసు భద్రత ఉండాల్సిందే..



రోగుల ఆరోగ్యం కోసం రేయింబవళ్లు పనిచేసే వైద్య సిబ్బందిపై దాడులు చాలా బాధాకరం. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. మహిళా డాక్టర్లు నైట్ డ్యూటీలు చేయాలంటే రక్షణ కావాలి. రోగులతోపాటు అటెండెంట్లు, బంధువులు పెద్ద సంఖ్యలో వస్తారు. వైద్యం చేయడంలో కొంచెం ఆలస్యమయినా సిబ్బందిపై దౌర్జన్యానికి దిగుతారు. ఇలా చేయడం మా వైద్య సిబ్బంది మానసిక స్థయిర్యాన్ని దెబ్బతీస్తుంది. పోలీసు బందోబస్తు ఉంటే అలాంటివారు భయపడతారు.

– డాక్టర్ జయలక్ష్మి, వైద్యాధికారి, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి

వసతులు మెరుగుపడాలి



మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి తప్పనిసరిగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. రాత్రుల సమయంలో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా వాష్‌రూమ్‌లు ఉండాలి. రాత్రుల సమయంలో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. స్థానికంగా ఉన్న పీహెచ్‌సీల్లో ఎంఎల్‌హెచ్‌పీలుగా కొత్తవారు విధులు నిర్వహిస్తుంటారు. అలాంటి వారికి రక్షణ అవసరం. మహిళా వైద్యులు, సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వాలు సీరియస్‌గా వ్యవహరించాలి.

– డాక్టర్ ఎస్తేర్‌రాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చూచుకొండ

న్యూస్‌రీల్

టంగుటూరికి నివాళి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: సమాజానికి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో టంగుటూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఆర్వో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన్ను స్మరించుకుంటూ ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల డిశ్చార్జి



సౌజన్యను 108 వాహనంలో తరలిస్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట (విశాఖ)/ కోటవురట్ల: కేజీహెచ్ పిల్లల వార్డులో, కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాసా ట్రస్ట్ ఆశ్రమ పిల్లలు శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని పాసా ట్రస్ట్ ఆశ్రమంలో పిల్లలు విషాహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నెల 19 నుంచి కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మందికి చికిత్స అందిస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు వారికి సేవలందిస్తున్నారు. ఇందులో 26 మంది పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మిగిలిన 10 మందిలో ఆరుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురు బాలికలు చికిత్స పొందారు. వారు పూర్తిగా కోలుకోవడంతో వైద్యుల సూచనలతో శుక్రవారం డిశ్చార్జి చేశారు. వీరికి తహసీల్దారు జానకమ్మ 25 కిలోల బియ్యం, పోషకాహారం అందజేశారు. హుకుంపేట మండలం గరుడాపల్లికి చెందిన పి.సౌజన్యను 108 వాహనంలో ఆమె ఇంటికి పంపించారు. డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెట్ జ్యోతికి ప్రోత్సాహకం

విశాఖ స్పోర్ట్స్: ఇటీవల ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విశాఖ క్రీడాకారిణి జ్యోతికి జిల్లా బాస్కెట్ బాల్ సంఘం, ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ నగదు ప్రోత్సాహాన్ని అందించాయి. స్థానికంగా శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు రూ.30 వేల చెక్కును రెండు సంఘాల ప్రతినిధులు అందజేసి అభినందించారు.

ఆయన రాకే.. ఓ ధైర్యం



అనకాపల్లి మెయిన్‌రోడ్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



- ఎసైన్షియా ప్రమాదంలో క్షతగాత్రులకు మాజీ సీఎం జగన్ పరామర్శ
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా..
- కుటుంబ సభ్యులకు ఆప్యాయంగా పలకరింపు..
- అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద జననేతను చూసేందుకు ఎగబడ్డ జనం

విశాఖ సిటీ : ఆయన రాకతో బాధితుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. ఆయన ఆత్మీయ పలకింపు కొంత ఉపశమనాన్ని కలిగించింది. అన్నలా.. కుటుంబ పెద్దలా.. వారి బాగోగులు తెలుసుకోవడంతో కొండంత ధైర్యం వచ్చింది. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రికి వెళ్లారు. ఉదయం 10 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్న జగన్‌కు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నేరుగా అనకాపల్లిలో ఉషా ప్రైమ్ ఆస్పత్రికి 11.15 గంటలకు చేరుకున్నారు.

బాధితులకు భరోసా

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరినీ జగన్ ఆప్యాయంగా పలకరించారు. కంపెనీల్లో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నారని, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ప్రమాద సమయంలో జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. వారి ఆరోగ్యం, అందిస్తున్న వైద్యంపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి భరోసా ఇచ్చారు. సుమారు గంటన్నర పాటు ప్రతి ఒక్క క్షతగాత్రులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు, మూడు వారాల్లో బాధితులకు పరిహారం అందించని పక్షంలో తాను ధర్నాలో కూర్చుంటానని హెచ్చరించారు.

అదే ప్రేమ.. అదే అభిమానం

బాధితులను పరామర్శించడానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనకాపల్లికి వచ్చారన్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జన సందోహంతో నిండిపోయింది. జగనన్న.. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఒకవైపు జగన్‌కు జై కొడుతూనే.. మరోవైపు 'గోవింద.. గోవింద.. సూపర్ సిక్స్ గోవింద' అంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ఎద్దేవా చేస్తూ నినదించారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారిపోయింది. భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలను కట్టడి చేయడానికి పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12.30 గంటలకు జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ఎక్కి బయలుదేరారు. అక్కడి నుంచి గాజువాక మిందీ ప్రాంతంలో ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నివాసానికి వెళ్లి లంచ్ చేశారు. అనంతరం 1.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని విమానంలో తిరుగుపయనమయ్యారు.

ఈ పర్యటనలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, పేర్ని నాని, ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకట సత్యవతి, ఎంవీవీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ముఖ్యనేతలు దంతులూరి దిలీప్‌కుమార్, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ రీజనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



ఉషాప్రైమ్ ఆస్పత్రి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



బాధితులకు ఓదార్పు

అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మా ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మృత్యు కుహరాలు

- ఫార్మా పరిశ్రమలో వరుస ప్రమాదాలు
- భద్రత ప్రమాణాలు పాటించని సంస్థలు
- చూసీచూడనట్టుగా అధికారులు

సాక్షి, అనకాపల్లి: ఫార్మా పరిశ్రమలు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. 'పరవాడ–అచ్యుతాపురం' స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో తరచుగా జరుగుతున్న ప్రమాదాలు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని సంస్థల వల్ల కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ సెజ్ పరిధిలో జూన్, జూలై, ఆగస్టులో జరిగిన 7 వరుస అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంఎన్‌సీ స్థాయి పరిశ్రమల్లోనూ ప్రమాదాలు జరగడంతో పారిశ్రామిక భద్రతలో డొల్లతనం తరచూ బయటపడుతోంది. సాహితీ ఫార్మాలో అగ్ని ప్రమాదం నుంచి మూడు రోజుల కిందట ఎసైన్షియా ఫార్మా కంపెనీలో, ఈ రోజు జేఎస్ ఫార్మాసిటీలోని సినర్జిన్ సంస్థలో జరిగిన ప్రమాదం వరకు అన్నీ కార్మికులకు పీడకలగా మారాయి. పరిశ్రమల్లో నిర్వహణ లోపాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏదో ఘోరం జరిగినప్పుడు తప్ప.. అధికార యంత్రాంగం పరిశ్రమలపై దృష్టి పెట్టిన సందర్భాలు ఉండడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన భద్రతా ప్రమాణాలను ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పట్టించుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటి వరకు పరిశ్రమల భద్రతపై ఒక్కసారి కూడా సమీక్షించలేదు.



సెజ్‌లోనే ప్రమాదాలు ఎందుకంటే..?

ఉమ్మడి విశాఖలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నప్పటికీ.. ప్రత్యేక ఆర్థిక మండలి జోన్లలో అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సెజ్, నాన్ సెజ్ పరిధిలో 19 అత్యంత ప్రమాదకర పరిశ్రమలు ఉండగా..192 ప్రమాదకరమైన పరిశ్రమలు, 56 రెడ్ కేటగిరీ పరిశ్రమలు, 82 ఔషధ పరిశ్రమలున్నాయి. ఈ కంపెనీల్లో దాదాపుగా 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు సరైన మానవవనరుల నియామకంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే సంభవించినట్లు అధికారుల నివేదికల ద్వారా వెల్లడైంది. వీటిని అరికట్టే విషయంపై అటు యాజమాన్యాలు గానీ, అధికార యంత్రాంగం గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పట్టించుకోని యంత్రాంగం

పరిశ్రమల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమల్లో సేఫ్టీ అంశాలు, నిత్యం పరికరాల తనిఖీలు వట్టి మాటగానే మిగిలాయి. కేవలం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే అధికారులు, నాయకులు అనంతరం ఇటువైపు చూడడం లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. ఇటీవల పరిశ్రమలలో భద్రత, ప్రమాదాల నివారణ, రక్షణ అంశాలను జిల్లాకు చెందిన అధికారుల బృందాలు పరిశీలించి, పై అధికారులకు నివేదికలు ఇచ్చినా.. వరుసగా ప్రమాదాలు జరగడంతో పారిశ్రామిక రంగ భద్రతలో డొల్లతనమే కన్పిస్తోంది.

రక్షణ లేని జీవితాలు

ఫార్మా పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇళ్లకు చేరడం కష్టంగా మారింది. రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు కూడా లేకపోవడం, శిక్షణ పొందిన ఫైర్ సిబ్బందిని నియమించకపోవడంతో అధిక ప్రమాదాలకు కారణమని చెప్పొచ్చు. ఇక్కడ నిపుణులైన కార్మికులను నియమించాల్సి ఉండగా కనీస అవగాహన లేని టెంపరరీ, కాంట్రాక్ట్ కార్మికుల చేత పనులు చేయిస్తున్నారు. వారు రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్లు జరుగుతున్నాయి. చాలా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే చికిత్స కోసం తరలించేందుకు సరైన అంబులెన్స్ లాంటి వాహన సౌకర్యాలు కూడా లేవు. పరిశ్రమల్లో వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగి అక్కడ నుంచి నగరానికి చేరేలోపు కార్మికులు మృత్యువాత పడుతున్నారు.

గుడివాడ ఇంట్లో జగన్



గుడివాడ అప్పలరామ్మూర్తిని పలకరిస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం 68వ వార్డు మిందిలోని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నివాసానికి విచ్చేశారు. అనకాపల్లి నుంచి తిరుగు ప్రయాణంలో వచ్చిన ఆయన గుడివాడ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తితో ముచ్చటించారు. అమర్‌నాథ్ కుమార్తెలు జగన్‌మోహన్‌రెడ్డితో ఆప్యాయంగా మాట్లాడారు.

కొండెంపూడి భూవివాదంలో రైతులకు ఊరట

- పట్టాలు పొందిన వారికే పూర్తి హక్కులుంటాయని హైకోర్టు తీర్పు

బుచ్చెయ్యపేట: మండలంలో కొండెంపూడి శివారు ఐయ్యరకపాలెం గ్రామంలో డీ పట్టా భూముల వివాదంలో రైతులకు మద్దతుగా హైకోర్టు తీర్పు వెల్లడించింది. 20 ఏళ్ల కిందట పట్టాలు పొందిన రైతులకే తప్ప రెవెన్యూ అధికారులకు ఎటువంటి హక్కులు లేవని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. టీడీపీ నాయకుల మాటలతో అత్యుత్సాహం కనబరిచిన రెవెన్యూ అధికారులకు కోర్టు అక్షింతలు వేసినట్టు రైతుల తరపు న్యాయవాది వెంకటరావు తెలిపారు. ఈనెల 9వ తేదీ తెల్లవారుజాము 6 గంటలకు 25 మంది పోలీస్ బందోబస్తుతో సాగు రైతుల పట్టా భూముల్లో ఉన్న పశువుల షెడ్లను, ఫెన్సింగ్‌ను జేసీబీతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. కొండెంపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 5–1లో కడియాల రామారావుకు 4.21 ఎకరాలకు, సర్వే నెంబర్ 5–2లో కడియాల సాంబశివరావుకు 1.73 ఎకరాలకు ప్రభుత్వం 1993లో డీ పట్టాలు అందించింది. ఈ భూములను రైతులు సాగు చేస్తూ ఇటీవల అనారోగ్య కారణంగా స్థానికంగా ఉన్న రైతులకు భాగానికిచ్చారు. ప్రతి సంవత్సరం రైతుల నుండి సగ ఫలసాయం పొంది జీవిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఈ భూములను కడియాల రామారావు కుటుంబ సభ్యులు, సాంబశివరావు అమ్మేశారని స్థానిక టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు బలవంతంగా జేసీబీతో తొలగించారు. సాగు రైతులు హైకోర్టును ఆశ్రయించగా.. పట్టాలు పొంది 20 ఏళ్లు దాటడంతో రెవెన్యూ అధికారులకు ఈ భూములపై ఎటువంటి హక్కులుండవని, పట్టాలు పొందిన రైతులకే ఈ భూములపై సర్వ హక్కులుంటాయని హైకోర్టు తెలపడంతో సాగు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొండెంపూడిలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా ఏర్పాటు చేసిన బోర్డులు (ఫైల్)

మొక్కుబడిగా గ్రామ సభలు

- జిల్లాలో 628 చోట్ల సభల నిర్వహణ
- ప్రజల నుంచి స్పందన శూన్యం

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల: పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయితీలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలు తూతూ మంత్రంగానే జరిగాయి. గతంలో దఫదఫాలుగా జరిగే గ్రామ సభలను ఇప్పుడు ఒకేసారి నిర్వహించారు తప్ప.. గ్రామ సమస్యలపై దృష్టి సారించలేదు. ప్రజలు గ్రామ సభలకు రావడానికే మొగ్గు చూపలేదు. సభల్లో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి ప్రాధాన్యత కల్పించలేదు. అధికార పార్టీకి చెందిన వారు ఈ గ్రామసభలను వైఎస్సార్‌సీపీపై ఆరోపణలకు, కూటమి ప్రభుత్వంపై పొగడ్తలకు వినియోగించుకున్నారు. జిల్లాలో 645 గ్రామ పంచాయతీల్లో 628 సభలు నిర్వహించారు.

తుమ్మపాల గ్రామసభలో కూటమి నాయకుల ఓవరాక్షన్

తుమ్మపాలలో శుక్రవారం జరిగిన గ్రామసభ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఓవరాక్షన్‌తో ఉద్రిక్తతకు దారి తీసింది. పాలకవర్గం సభ్యులపై దాడి చేసే ప్రయత్నం కూడా చేశారు. సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో.. ముందు రోజు విడుదల చేసే అజెండా సర్క్యులర్‌లో తమ పేర్లు ఉద్దేశపూర్వకంగా చేర్చలేదంటూ కూటమి నాయకులు సర్పంచ్, పాలకవర్గ సభ్యులపై తిరగబడ్డారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు కల్పించుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వచ్చిన సర్క్యులర్ తప్ప ఎటువంటి మార్పులు చేయలేదని తెలియజేసినప్పటికీ కూట మి నాయకులు తగ్గలేదు. సర్క్యులర్‌లో తన పేరు ను చెరిపి కూటమీ నాయకులు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంపై సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అసహనం వ్యక్తం చేశారు. దళిత సర్పంచ్ అనే ఉద్దేశంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. నచ్చజెప్పే ప్రయత్నం చేసిన పోలీసులపై కూడా కూటమి నాయకులు తిరగబడ్డారు. ఈ ఘ టనపై పోలీస్, పంచాయతీ రాజ్, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ తెలిపారు.



తుమ్మపాల సభలో గందరగోళం

మాకవరపాలెంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్న

మాకవరపాలెం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన గ్రామసభలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఏవి అవసరమో వాటిని అధికారుల దృష్టికి తీసుకువస్తే అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పెదబొడ్డేపల్లి నుంచి తాళ్లపాలెం రోడ్డులో పరిమితికి మించి లారీలు తిరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఉపమాకలో పాల్గొన్న హోం మంత్రి అనిత

నక్కపల్లి: హోం మంత్రి వంగలపూడి అనిత ఎంపీ సి.ఎం.రమేష్‌తో కలసి ఉపమాకలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా గ్రామంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు.



ఉపమాక సభలో మాట్లాడుతున్న మంత్రి అనిత

భయమేస్తోంది



ఇటీవల కాలంలో వైద్య సిబ్బందిపై దాడులు, దౌర్జన్యాలు జరగడం సరికాదు. ఎంతో అంకితభావంతో పనిచేస్తున్న మాపై ఇటువంటి ఘటనలు జరగడంతో భయం వేస్తోంది. వైద్య సిబ్బందికి భద్రత లేకపోతే, సేవలు అందించడం చాలా కష్టం. పోలీసు బందోబస్తు ఉండాల్సిందే. రోగులతోపాటు బంధువులు రావడం, వైద్యంలో పనిఒత్తిడితో వెంటనే స్పందించకపోయినా తమతో వాదనకు దిగుతున్నారు. వైద్య సిబ్బందిని అర్థం చేసుకోవాలి. బంధువులు వేచి ఉండేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. వారి పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఏదైనా సంఘటన జరిగితే చర్యలు కఠినంగా ఉండాలి.

– శ్రీదేవి, స్టాఫ్ నర్స్, నక్కపల్లి ఆస్పత్రి

పటిష్టమైన చర్యలు తీసుకోవడం మేలు



కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఉదంతం అత్యంత దయనీయం... అమానుషం.. అటువంటి దుర్ఘటనలకు తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్లు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో, రక్షణ పట్ల అత్యంత శ్రద్ధ చూపాలి. మహిళా సిబ్బంది పనిచేసే చోట్ల ఎటువంటి వివక్షకు తావు లేకుండా చూడాలి.

– రవికుమార్, మల్టీ పర్పస్ హెల్త్ ఆఫీసర్, గవరవరం పీహెచ్‌సీ, చోడవరం మండలం

రాత్రిళ్లు భద్రత కల్పించాలి



కోల్‌కతా జూనియర్ వైద్యురాలి ఘటన దేశంలో మరెక్కడా జరగకుండా ప్రభుత్వాలు ముందుగా చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులకు భద్రత కల్పించే విధంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. వారి విషయమై నిబంధనలలో మార్పులు అవసరమయినట్టయితే అందుకు వెనకడుగు వేయకుండా తగు ప్రాముఖ్యం ఇవ్వడం అందరూ స్వాగతించాలి.

– కనకదుర్గ, ఎన్టీఆర్ వైద్యురాలు, అనకాపల్లి

– నక్కపల్లి,చోడవరం రూరల్, అనకాపల్లి

క్లుప్తంగా

యలమంచిలిలో 27న జాబ్‌మేళా

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 27న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరవాడలోని అరబిందో ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్ హెల్పర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన 18 నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 8106327482 సంప్రదించాలని కోరారు.

ప్రిన్సిపాల్ మృతికి సంతాపం



రవిశంకర్ నాయక్

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రవిశంకర్ నాయక్ (45) మృతికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆర్నెల్ల క్రితం కళాశాల ప్రిన్సిపాల్‌గా చేరిన ఆయన గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు అనంతపురం జిల్లా గుంతకల్లులో నివాసముంటున్నారు.

జగన్ పరామర్శలో జేబుదొంగ చేతివాటం

- నిందితుడి నుంచి రూ.32 వేల స్వాధీనం

అనకాపల్లి: సందట్లో సడేమియా అన్నట్టుగా స్థానిక ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద విజయవాడకు చెందిన జేబుదొంగ కట్టా బుజ్జి తన చేతివాటం ప్రదర్శించాడు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్షతగాత్రులను పరామర్శించే సమయంలో ఇక్కడ ఆస్పత్రి బయట వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, బాధిత కుటుంబాల వారు గుమిగూడారు. ఇదే అదనుగా భావించిన బుజ్జి వారి జేబుల్లో పరసలు దొంగిలించాడు. అక్కడే ఉన్న పోలీసులు గుర్తించి, పట్టుకుని విచారించగా చోరీలు చేస్తున్నట్టు అంగీకరించాడు. అతడి నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వణికిస్తున్న ఫార్మా ప్రమాదాలు

- ఏ క్షణానికి ఏం జరుగుతుందోనని తల్లిదండ్రుల ఆందోళన
- ఉద్యోగాలు మాని వచ్చేయమని పిల్లలపై ఒత్తిడి



ఎసైన్షియా ఫ్యాక్టరీ ముందు గుమిగూడిన జనం

యలమంచిలి రూరల్: ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దినదినగండంగా మారింది. ఉన్నత చదువులు చదువుకున్న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న అనేక ఫార్మా పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. తమ పిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని ఆనందిస్తున్న తల్లిదండ్రులు వరుస ప్రమాదాలతో తల్లడిల్లుతున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణి కలవరపెడుతోంది. భద్రతాచర్యలు తీసుకోవడం లేదు సరికదా ప్రమాదాలు జరిగినప్పుడు కనీస సమాచారం అందించడం లేదని కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు వాపోతున్నాయి. ఫార్మా ఉద్యోగాలు మాని మరో కొలువు చూసుకోమని కుటుంబ సభ్యులు ఒత్తిడి చేసేటంత భయాందోళనలు వారిలో నెలకొన్నాయి. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియో అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో ఈనెల 21న జరిగిన ప్రమాదం, తాజాగా శుక్రవారం పరవాడ సెజ్‌లో సినర్జిన్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంతో.. ప్రాణాలను పణంగా పెట్టవద్దంటూ అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫోన్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

తప్పనిసరి పరిస్థితుల్లోనే ఉద్యోగాలు చేస్తున్నారు



భద్రతా ప్రమాణాలు కరువైన అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమల్లో తప్పనిసరి పరిస్థితుల్లోనే అనేకమంది యువకులు ఉద్యోగాలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల రక్షణను విస్మరిస్తున్నాయి. సేఫ్టీ ఆడిట్ సక్రమంగా చేయడంలేదు. థర్డ్ పార్టీ ఏజెన్సీలతో పరిశ్రమల యాజమాన్యాలు తమకు అనుకూలంగా సర్టిఫికెట్లన్నీ తెచ్చుకుంటున్నాయి. దీంతో భద్రత కరువైంది.

– ఎం వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సెజ్‌లో పరిస్థితులు దారుణం



అచ్యుతాపురం సెజ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. విదేశాల్లో నిషేధించిన కంపెనీలకు ఇక్కడ మన ప్రభుత్వాలు ఆహ్వానం పలుకుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటులో భద్రతా చర్యలు తీసుకోవడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయి. దీంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గాలి, నీరు, నేల కలుషితం చేస్తున్న పరిశ్రమల వలన ఉపాధి అవకాశాలకన్నా నష్టమే అధికంగా ఉంటోంది.

– ఎస్ వెంకటలక్ష్మి, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు, ఉమ్మడి విశాఖ జిల్లా

ప్రజల ప్రాణాలతో చెలగాటం



ఇక్కడ ఆర్నెల్లో మూడు ప్రమాదాలు జరిగాయి. వ్యవసాయం చేసుకునే రోజుల్లో కుటుంబ సభ్యులు ఇంటికొస్తారన్న గ్యారెంటీ ఉండేది. పరిశ్రమల్లో ఉద్యోగాలకు వెళుతున్న వారు ఇంటికొచ్చేవరకూ ఆందోళనే. ప్రమాదాలకు కారణమయ్యే పరిశ్రమలకు ఎందుకు అనుమతులిస్తున్నారో అర్థం కావడంలేదు.

– ఉపమాక జ్యోతి, వాశెట్టిపాలెం, అచ్యుతాపురం మండలం (మృతుడు చిన్నారావు బంధువు)

ఫార్మా కంపెనీలో ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ

కలెక్టర్ విజయ కృష్ణన్



ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిని పరామర్శిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: రాంబిల్లి ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం రాష్ట్రస్థాయి హైలెవల్ కమిటీని సోమవారం ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. స్థానిక ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అన్ని విభాగాల అధికారులతో మాట్లాడినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టనున్నట్టు ఆమె తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ. కోటి చొప్పున చెక్కులను అందజేసినట్టు చెప్పారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారికి రూ.50లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25లక్షల చొప్పున నగదును అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పరిశ్రమల్లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా హైసెక్యూరిటీ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్టు కలెక్టర్ చెప్పారు. గురువారం రాత్రి పరవాడలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వారు విశాఖ ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, ఆర్డీవో ఏజే చిన్నకృష్ణ, డీసీహెచ్‌ఎస్ ఎస్.శ్రీనివాసరావు, ఉషాప్రైమ్ ఆస్పత్రి ఎండీ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సినర్జిన్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలకు డిమాండ్

అనకాపల్లి: పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ యూనిట్-3లో రియాక్టర్ పేలిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నలుగురు కార్మికులు విశాఖ ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రభుత్వమే వీరికి పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా ఘటన జరిగి 24 గంటలు గడవక ముందు పరవాడ ఫార్మాలో మరో ప్రమాదం జరిగిందంటే, కంపెనీ యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతుందన్నా రు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలు లాభాలే పరమావధిగా పనిచేస్తున్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడం వల్లే తరుచూ ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని ఉంటే, ఇలాంటివి పునరావృతం కావన్నారు.

అనకాపల్లి డీఎస్పీగా శ్రావణి



అనకాపల్లి: అనకాపల్లి డీఎస్పీగా ఎం.శ్రావణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ అప్పలరాజును విజయవాడ పోలీస్ హెడ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో ఇంటిలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చానన్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

మాడుగుల రూరల్: మండలంలో కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన అనపగడ్డ సత్యనారాయణ అలియాస్ నానాజీ (39) కడుపు నొప్పి తాళలేక పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సత్యనారాయణ తన ఇంట్లో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు భార్య వెంకట దుర్గా రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాతవరం యువతికి గోల్డెన్ హార్స్ టైటిల్



జ్ఞాపిక అందుకుంటున్న శిరీష

నాతవరం: గోల్డెన్ హార్స్ టైటిల్ విన్నర్‌గా నాతవరం యువతి ఎం.శిరీష నిలిచింది. మాంటి ప్రొడక్షన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వారం రోజులపాటు మిస్టర్ అండ్ మిస్ గార్జియస్ ఆఫ్ ఇండియా (సీజన్-4) పోటీలను నిర్వహించారు. ఇక్కడ టైటిల్‌కు ఎంపికైన వారితో క్యాన్సర్ బారిన పడిన వారిలో మనోధైర్యం నింపేందుకు ప్రచారం చేయనున్నారు. ప్రముఖ కంపెనీల యాడ్స్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత మొత్తం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను పంపిస్తారు. మాంటి ప్రొడక్షన్ చేపట్టిన ఎంపిక కార్యక్రమం ద్వారా తనకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా శిరీష ఆనందం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతం నుంచి వెళ్లిన శిరీష ఈ పోటీల్లో విజేతగా నిలవడంతో స్నేహితులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ అధికారులు పలువురికి యాజమాన్యం శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ పనులను ఆయా విభాగాలకు చెందిన వివిధ స్థాయిల అధికారులు పర్యవేక్షిస్తూ ఇంజినీర్ ఇన్ చార్జ్‌లుగా వ్యవహరిస్తుంటారు. వారు కాంట్రాక్ట్ పనుల నిర్వహణతో పాటు అటెండెన్స్, బిల్లింగ్ పనులు చూస్తుంటారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బయోమెట్రిక్ అమలు చేయడంతో వారి అటెండెన్స్ బయోమెట్రిక్ ఆధారంగా సర్టిఫై చేయాల్సి ఉంది. ఈ విషయంలోనే యాజమాన్యం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. కాంట్రాక్ట్ కార్మికుల బిల్లింగ్‌లో అధికారులు నిర్లక్ష్యం, పక్షపాతంగా వ్యవహరించారంటూ నోటీసులో పేర్కొన్నారు.

ఈ విధంగా ప్లాంట్ మొత్తం సుమారు 250 మంది ఉన్నట్లు సమాచారం. నోటీసులను హెచ్ఆర్ అధికారులు ఆయా విభాగాధిపతులకు అందించాశారు. ఈ విషయం స్టీల్‌ప్లాంట్ అధికారుల్లో కలకలం రేపింది.

శ్రావణ లక్ష్మికి కుంకుమ పూజలు



గవరపాలెం సంతోషిమాత, నూకాంబిక అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

అనకాపల్లి: ఊరూవాడా వరలక్ష్మీదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా భక్తులు తమ శక్తిమేరకు లక్ష్మీదేవిని పూజించారు. ఇందులో భాగంగా సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని చెరకుగడలు, బెల్లం దిమ్మలతో అలంకరణ చేశారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు.

నూకాంబిక అమ్మవారి ఆలయంలో...

ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో శుక్రవారం ఇక్కడ ఉచితంగా సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారి కొండపైన ...

సత్యనారాయణపురం కనకదుర్గ ఆలయంలో భక్తులతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, ధర్మకర్త బోయిన రమణాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి మృత్యువాత

దేవరాపల్లి శారదానదిలో పడి యువకుడి మృతి



ఆరిపాక రఘు(ఫైల్)



శారదానది నీటిలో తేలిన రఘు మృతదేహం

దేవరాపల్లి: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన యువకుడు స్థానిక శారదానదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనతో దేవరాపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి అర్జున, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక రామాలయం వీధిలో నివాసముంటున్న ఆరిపాక రఘు(30) ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో కుమారుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం దేవరాపల్లి పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా శారదానదిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి తండ్రి అర్జున, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అందరితో సరదాగా ఉండే రఘు మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. మృతుడి తండ్రి అర్జున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

ఆర్టీసీ స్థలం లీజుకు ఇవ్వడానికి వీల్లేదు

డిపో మేనేజర్‌పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిందులు



ఆర్టీసీ డీఎం ధీరజ్‌ను ప్రశ్నిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ఆర్టీసీ స్థలం లీజుకు ఇవ్వడానికి వీల్లేదని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. లీజుదారుడు స్థలాన్ని లెవెల్ చేసేందుకు గ్రావెల్ తొలగించగా.. ఈ విషయం తెలుసుకున్న అయ్యన్నపాత్రుడు కార్యకర్తలతో కలిసి ఆర్టీసీ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. గ్రావెల్ వేస్తుంటే ఏమి చేస్తున్నారంటూ డీఎం ధీరజ్, సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాది.. లీజుపై మేము నిర్ణయం తీసుకుంటాం.. మీరెవరు నిర్ణయం తీసుకోవడానికి.. అని డీఎంను నిలదీశారు. నీపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానంటూ బెదిరించారు. 24 గంటల్లో సెక్యూరిటీ సిబ్బందిని సస్పెండ్ చేసి, మట్టి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్ని ఒప్పించి (2014–19) గత టీడీపీ ప్రభుత్వం కాలంలోనే ఆర్టీసీకి స్థలం సేకరించామన్నారు. ఆ స్థలాన్ని అప్పట్లోనే లీజుకు ఇస్తే నాటి సీఎం చంద్రబాబు, నాటి మంత్రి అచ్చెన్నాయుడుకు చెప్పి లీజు క్యాన్సిల్ చేయించానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేరొకరికి లీజుకు ఇచ్చినప్పుడు కూడా అడ్డుకున్నానని.. రైతులు త్యాగం చేసి ఇచ్చిన స్థలంలో ఎవరో వచ్చి వ్యాపారం చేయడం అన్యాయమన్నారు. ఆర్టీసీ ఆర్ఎంపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని, ఈ విషయంలో ఎవర్నీ వదిలి పెట్టనన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మారేష్



నియామక పత్రం అందుకుంటున్న మారేష్

అచ్యుతాపురం(మునగపాక): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అచ్యుతాపురం మండలం ఎం.ధర్మవరం గ్రామానికి చెందిన పెంకే మారేష్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మారేష్ మాట్లాడుతూ కృష్ణయ్య నాయకత్వంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఉద్యోగ భర్తీ విషయంలో బీసీలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్, విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పితాని అన్నవరం, తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మాడుగుల ఆస్పత్రిలో జ్వర బాధితులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

మాడుగుల: మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కిముడు వరహాలు దొర, ఇమ్యూనైజేషన్ అధికారి రంజిత్ తెలిపారు. పడగ విప్పిన వైరల్ జ్వరాలు అనే శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా మలేరియా అధికారులు స్పందించారు. డీఎంహెచ్‌వో బాలాజీ ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి, ఇమ్యూనైజేషన్ అధికారి శుక్రవారం స్థానిక 30 పడకల ఆస్పత్రిలో ప్రతి వార్డును పరిశీలించారు. జ్వరబాధితులకు వైద్యం ఎలా అందుతుందో ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు. స్థానిక కొబ్బరితోట వీధి, దొర్లవీధిలో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు

మహారాణిపేట : పోర్టు స్టేడియంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజుకు సుమారు 500 నుంచి 800 వరకు అభ్యర్థులు వచ్చే అవకాశం ఉన్నందున.. అందుకు తగ్గట్లు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే డైమండ్ జూబ్లీ మైదానంలో బ్యారికేడింగ్, విద్యుత్ దీపాలు, సీసీ టీవీల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. పనులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు, ఎంపిక ప్రక్రియలో రిజిస్ట్రేషన్, పత్రాల స్కీనింగ్, ఇతర అంశాల పర్యవేక్షణకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది ఉండేందుకు వసతి ఏర్పాట్లు, మైదానం వెలుపల అభ్యర్థులు క్యూలైన్లలో వచ్చేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.



వైద్యులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి

వైద్య సేవల నిమిత్తం ఏ మాత్రం రక్షణ లేని ప్రాంతాలకు వెళ్లినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాం. అలాంటప్పుడు మాకు రక్షణ కావాలి. ప్రభుత్వం వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టాలే తేవాలి. పరిమితికి మించి వైద్యుల పట్ల ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు ఉన్నప్పుడు వైద్యులకు రక్షణ ఉంటుంది. స్వేచ్ఛగా సేవలు అందించగలం. ఆస్పత్రుల్లోనూ వైద్యులకు ప్రత్యేక వసతులు కల్పించాలి. కొన్ని సందర్భాల్లో రోగుల బంధువులు అవగాహనలేమితో వైద్యులు, ఆస్పత్రులపై తిరుగుబాటు చేసే పరిస్థితులు చూస్తున్నాం. అలాంటి పద్ధతి మారాలి. ప్రజలు, ప్రభుత్వాలు వైద్యులకు రక్షణగా నిలవాలి.

–ఎస్. వాణీజగదీశ్వరి, వైద్యురాలు, అనకాపల్లి



ప్రజలు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి ఘటనలో నిందితులను తక్షణమే శిక్షించాలి. ఈ విషయంలో తాత్సార్యం చేస్తుండటం శోచనీయం. వైద్య, ఆరోగ్య సిబ్బందిపై తరచుగా దాడులు జరుగుతున్నాయి. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ప్రతి ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రధానంగా రాత్రి పూట రక్షణ మెరుగుపర్చాలి. వైద్యులు సాధ్యమైనంత మేర ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రయత్నిస్తారు. కావాలని ప్రాణాలు తీయరు. ఈ విషయం గ్రహించక దాడులకు తెగబడటం సమంజసం కాదు. ప్రజలు సామాజిక స్పృహ కలిగి ఉండాలి. సామాజిక స్పృహతో కూడిన విద్యను అందివ్వడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. సమాజంలో శాంతియుత వాతావరణం ఏర్పడనుంది.

–ఎస్.తిరుపతిరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కశింకోట



ప్రత్యేక చట్టాలు తేవాలి

రోగులకు అత్యవసరమైన పరిస్థితుల్లో ప్రాణాలు పోసే వైద్యులపై కొన్ని సందర్భాల్లో దాడులు చేస్తున్నారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించినట్లయితే దేశంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కావు. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి, అమలు చేయాలి. వైద్యులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలి.

– డి.డి.నాయుడు, వైద్యుడు, అనకాపల్లి(23ఎకెపి38)

క్లుప్తంగా

రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్‌గా రమణాజీ

అనకాపల్లి: అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ వెంకటస్వామి నాయుడు రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్‌గా బుద్ద రమణాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక న్యూకాలనీ రోటరీ కంటి హాల్లో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సరిపల్లి రాజేష్, కార్యదర్శిగా దేవత అనిల్, టెక్నికల్ పర్సన్స్‌గా పి.రాజేష్‌నాయుడు, కె.కుప్పంత్, కె.సతీష్, కుమార్, మల్లేశ్వరరావు, సాత త్రినాథ్, దుర్గాప్రసాద్, కమిటీ సలహాదారులుగా వి.రవిరాంజవహర్, పి.రాజేశ్వరిప్రసాద్ ఎన్నికయ్యారు.

గణపతి నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలని వినతి



జెడ్పీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఆడారి కుమార్‌స్వామి

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున వినాయక ఘాట్ వద్ద గణపతి నవరాత్రులకు అన్ని ఏర్పాట్లు చేయాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ వ్యవస్థాపక కమిటీ చైర్మన్ ఆడారి కుమార్‌స్వామి కోరారు. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్పీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌స్వామి మాట్లాడుతూ నెహ్రూచౌక్ నుంచి శారదానది ఒడ్డు వరకూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిత్యం శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక చవితి రోజున 30 నుంచి 40 వేల మంది భక్తులు మట్టి ప్రతిమలు నదిలో నిమజ్జనం చేయడానికి వస్తారన్నారు. వారికి తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొణతాల హరినాథ్‌బాబు, సుంకర చంద్రం, దాడి బుజ్జి, ఆడారి రవి, బొబ్బిలి సురేష్, పి. వరప్రసాద్, బి. జనార్దన్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 150 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	5,000
రెండో రకం	3,940	4,390
మూడోరకం	3,190	3,380

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	పర్తిసాయి
మారుతీనగర్ సుబ్రమణ్యం	షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	శ్రీసత్య
11 డిమోంటి కాలనీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

జగన్ రాక కోసం..

- ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద ఎదురు చూసిన జనం



ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద తన కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్

అనకాపల్లి: రాంబిల్లిలోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో గాయపడి వారిని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద ఆయన రాక కోసం గంటలకొద్దీ ఎదురు చూశారు. ఈ క్రమంలో ఉదయం 10.30 గంటలకు రావడంతో మా సీఎం జగన్‌మోహన్‌రెడ్డే అంటూ నినాదాలు చేశారు. ప్రజలు నేరుగా మాజీ సీఎం జగన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీస్‌లు అడ్డుకోలేకపోయారు. రోప్ పార్టీ పోలీస్‌లను నెట్టుకుంటూ ఆస్పత్రిలోకి చొచ్చుకుని పోతున్న సమయంలో ఆస్పత్రి ఎంట్రన్స్‌లో ఇరువైపులా గిల్స్ విరిగిపోయాయి. అయినప్పటికీ ఆస్పత్రిలోకి చొచ్చుకుని పోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఎంట్రన్స్ గేటులకు తాళాలు వేశారు. అప్పటికే కొంతమంది ప్రజలు చుట్టుపక్కల మేడలపై నుంచి ప్రజల సంక్షేమ రథసారథి.. జగనన్నకు జిందాబాద్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు బొడ్డేడ శివ, కలగ గున్నయ్యనాయుడు, బి.లక్ష్మీనరసింహరావు, పెదిశెట్టి గోవింద్, ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, మరిపల్లి శోభ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు

- సంపద కేంద్రాల్లో తయారు కాని వర్మీ కంపోస్టు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- మరుగునపడిన చెత్త సేకరణ రిక్షాలు
- నిర్మాణాలకు లక్షలాది రూపాయల వృథా



శంకరంలో అరకొరగా నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. పంచాయతీల్లో జీతాలు చెల్లించకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లు విధులకు దూరంగా ఉన్నారు. చెత్త సేకరణ రిక్షాలు తుప్పుపడుతున్నాయి. ఈ విషయంలో అధికారులు చోద్యం చూస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడే చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి.

తుమ్మపాల: చెత్త నుంచి సంపద తయారీ అనేది ఒక బృహత్తర పథకం. పర్యావరణానికి, పల్లెలకు మేలు చేస్తుంది. దురదృష్టవశాత్తూ పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఆచరణకు నోచుకోకుండా ఓ నినాదంగా మాత్రమే మిగిలింది. ప్రధానంగా పల్లెల్లో పరిశుభ్రత, పంచాయతీలకు ఆదాయం కోసం కేంద్ర ప్రభుత్వం ఉద్దేశించిన ఈ పథకం నీరుగారిపోయింది. గాం. దీజీ కలలు కన్నా పల్లెలే లక్ష్యంగా అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం గ్రామాల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి పూర్తి చేసిన సంపద కేంద్రాలపై కనీసం దృష్టి సారించలేదు. పల్లెల్లో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండటంతో మందుబాబులకు అడ్డాలుగా తయారయ్యాయి. పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి షెడ్లు ఏర్పాటు చేసింది. గ్రీన్ అంబాసిడర్ల (వీధుల్లోని వ్యర్థాలను తరలించే వారు)ను నియమించి, వారి ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టింది. తడి చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చి రైతులకు ఎరువుగా విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని సంకల్పించింది. అయితే పంచాయతీ పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారింది.

◆ నిరుపయోగంగా 16 కేంద్రాలు...

మండలంలోని 32 పంచాయతీలకు గాను 25 గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల నిర్మాణం పూర్తయింది. వాటిలో 9 కేంద్రాల్లో పారిశుధ్య సిబ్బంది నిత్యం చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. తద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి వినియోగిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా 16 కేంద్రాలు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. మండలంలో పారిశుధ్య లోపానికి నిలయంగా ఉంటే తుమ్మపాల, కొత్తూరు, కూండ్రం వంటి పెద్ద గ్రామాల్లో ఇప్పటికీ ఈ కేంద్రాల నిర్వహణపై పాలకులు, అధికారులు దృష్టి సారించే సాహసం చేయడం లేదు. ఈ పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బందికి కూడా జీతాలు సక్రమంగా ఇవ్వలేకపోతున్నారు. వీటితోపాటు గొలగాం, రేబాక, మారేడుపూడి, బట్లపూడి, మామిడిపాలెం, వెంకుపాలెం, తగరంపూడి, కొండుపాలెం వంటి గ్రామాల్లో ఈ కేంద్రాలు మందుబాబులకు అడ్డాలుగా తయారయ్యాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి.



గొలగాంలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

◆ పేరుకే సంపద కేంద్రాలు

సంపద తయారీ కేంద్రాలు పూర్తయిన పంచాయతీల్లో వీటి నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. వర్మీ కంపోస్టు కోసం ఏర్పాటు చేసిన తొట్టెలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. అనేక గ్రామాల్లోనూ సంపద తయారీ కేంద్రాలు ఖాళీగానే ఉన్నాయి. చెత్తను సేకరించకుండా వ్యర్థాలను తొట్టెల్లో పడేసి వర్మీ కంపోస్టుకు ఉపయోగిస్తున్నారు. దీంతో మండలంలో చాలా చోట్ల ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోతోంది. దీంతో గ్రామీణులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

వేతనాలు లేక చెత్త సేకరణ చేయని సిబ్బంది

పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు చెత్తను సేకరించడం మానేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండిపోతోంది. మండలంలోని సంపద తయారీ కేంద్రాల్లో ఒకటి రెండు గ్రామాల్లో తప్ప ఎక్కడా వర్మీ కంపోస్ట్ తయారు కావడం లేదు.

◆ చెత్త రిక్షాలు సైతం మూలన పడి తుప్పు పడుతున్నాయి. డంపింగ్ యార్డులు పిచ్చి మొక్కలు ముళ్లపొదలతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన రూ.లక్షలు నిరుపయోగంగా ప్రతి పంచాయతీలో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ చేపట్టాలి



చిన్న గ్రామాల్లో రూ.2.60 లక్షలు, పెద్ద గ్రామాల్లో రూ.5 లక్షలతో మండలంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను సక్రమంగా నిర్వహించడం లేదు. ఈ కేంద్రాలను నిర్వహించి తయారైన వర్మీ కంపోస్టు అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే అవకాశముంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూతూమంత్రంగా సంపద కేంద్రాలు మిగిలాయి. ఇప్పటికైనా వినియోగంలోకి తేవాలి.

– తలారి నాగేశ్వరరావు, గొలగాం, అనకాపల్లి మండలం

వచ్చే నెలలోగా అన్ని కేంద్రాలు అందుబాటులోకి..



మండలంలో 25 పంచాయతీల్లో 25 సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం పూర్తయ్యాయి. వాటిలో 9 కేంద్రాల ద్వారా చెత్త సేకరించి నిర్వాహణ కొనసాగుతోంది. మరో మూడింటిలో పనులు ప్రారంభించాం. మిగిలిన 13 కేంద్రాలు నిరుపయోగంగా ఉండకుండా గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరించి వచ్చే నెలలోగా అందుబాటులోకి తీసుకొస్తాం. మేజర్ పంచాయతీలు తుమ్మపాల, కొత్తూరు, మరికొన్ని గ్రామాల్లోనూ వీటిని వినియోగంలోకి తెస్తాం

– కె.ధర్మారావు, ఈవోపీఆర్డీ, అనకాపల్లి మండలం

టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం

- అదనపు ఎస్పీ దేవప్రసాద్



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికెదురుగా నిబ్బరంగా నిల్చి 'కాల్చుమని' తెల్లదొరలను హడలెత్తించి 'ఆంధ్రకేసరి'గా పేరుగాంచిన మహానుభావుడు అని కొనియాడారు. నిజాయితీ, నైతిక విలువలతో కూడిన జీవనశైలి నేటి యువతకు, ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకం అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి రాష్ట్ర, దేశ అభ్యున్నతికి పాటు పడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, ఎస్.ఎస్.సిహెచ్.చంద్రశేఖర్, ఎ.ఓ బి.శారద, ఎస్ఐ బి.అంజిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయ సిబ్బంది ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆచంట రవి, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

సామూహిక కుంకుమార్చనలు

కశింకోట: స్థానిక శివాలయంలో మూడో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సర్వమంగళాంబకు వేద మంత్రోచ్ఛరణల నడుమ అర్చకుడు వి.చిదంబరం పూజలు నిర్వహించారు. లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో అర్చకుడు అత్తిలి కోదండపాణి, గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం, ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు, కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఆయా ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు.

కుక్కను తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొని..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం హైవేపై దేవీపురం సమీపంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కుక్కను ఢీకొనడంతో, అదుపు తప్పి డివైడర్‌పై పడి శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. విశాఖ జిల్లాలోని వేపగుంట సమీపంలో కృష్ణరాయపురానికి చెందిన గుడిల్ల జయ సంపత్ కార్తీక్(39) సీసీ కెమెరాల రిపేర్లు చేస్తుంటారు. అందులో భాగంగానే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం వస్తుండగా ప్రమాదం జరిగి, తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2 గంటల సమయంలో మరణించడంతో, సబ్బవరం పోలీస్‌లకు మృతుని బంధువులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.

రైవాడ కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

సబ్బవరం: జోడుగుళ్ల సమీపంలో రైవాడ కాలువ జీవీఎంసీ పంప్ హౌస్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం లభ్యమయింది. సిమెంట్ బెంచ్‌పై మృతదేహాన్ని చూసిన స్థానికులు ఆ విషయాన్ని వీఆర్వోలు పూడి శేషు, అనంత్‌లకు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది సబ్బవరం పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద మృతుడు వేసుకున్న చెప్పులు, చేతికర్ర బెంచికి ఆనించి ఉన్నాయి. వీఆర్వోల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఎమ్మెస్సీ కంప్యూటర్స్ /ఎంసీఏ/ బీటెక్‌లో 55 శాతంతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

- ఎంపీ సీఎం రమేష్



తాళ్లపాలెంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీ సీఎం రమేష్ కోరారు. తాళ్లపాలెంలో ఉపాధి హామీ పనులు చేపట్టడానికి నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను పరిష్కరించాలని సభ దృష్టికి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, సర్పంచ్ రెల్లి నాగయమ్మ, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, పంచాయతీ కార్యదర్శి సత్యారావు పాల్గొన్నారు.



జమాదులపాలెంలో ఉపాధి గ్రామ సభ

మరికొన్ని గ్రామాల్లో...

కశింకోట గ్రామ సభలో సిమెంట్ రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, కాలువలు నిర్మించాలని, నీటి సరఫరాను మెరుగుపర్చాలని తదితర పలు సమస్యలను గ్రామస్తులు సభ దృష్టికి తెచ్చారు. సభ గురించి సరిగ్గా తెలియకపోవడంతో ప్రజలు తక్కువ మంది హాజరయ్యారు. ఈవోపీఆర్డీ సోమరాజు, సర్పంచ్ మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమోన్, జనసేన నాయకుడు వేగి రామకోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు పెంటకోట రాము పాల్గొన్నారు. జమాదులపాలెం, బయ్యవరం, కన్నూరుపాలెం, ఉగ్గినపాలెం తదితర గ్రామాల్లో గ్రామాల్లో సభలు నిర్వహించి ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు స్వీకరించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



అంతరిక్షంలో చంద్రయాన్ అడుగిడినప్పటి దృశ్యమాలిక పోస్టర్లను ప్రదర్శిస్తున్న బాలికలు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చంద్రునిపై విజయవంతంగా చంద్రయాన్-3 ఉపగ్రహం అడుగిడిన శుభ దినంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలికలు ఉత్సవ ప్రాధాన్యం వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాలలో బాలికలకు వక్తృత్వ, వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, జిల్లా సైన్స్ అధికారి దాడి కాశీదాసు, పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు